క్లుప్తంగా

నల్లగొండ్ల క్షేత్ర పాలకవర్గ ప్రమాణ స్వీకారం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ లెక్కల కాంతమ్మతో పాటు పాలకవర్గ సభ్యులతో ఈఓ శాంతయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సినీహీరో కార్తికేయ, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ లెక్కల చిన్నకొండారెడ్డి, స్థానిక పెద్దలు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి, ఎల్ లక్ష్మీకాంతమ్మ, గూడా నర్సారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, అంకినపల్లి ఓబులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిర పురోగతిపై దృష్టి



సీతారామపురం : పంచాయతీల సుస్థిర పురోగతిపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచికపై పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులకు శుక్రవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, ఉద్యానవన, ఆరోగ్యం, విద్య, తదితర శాఖలను సమన్వయం చేసుకోవడం ద్వారా పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ ఫజిహా, ఎంఈఓ మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తికి తెలుగుభాషా పురస్కారం



సంగం: తెలుగుభాష సాహిత్యాన్ని, సంస్కృతిని విద్యార్థులకు చేరువ చేస్తున్న మండలంలోని ముక్తాపురం పాఠశాల ఉపాధ్యాయుడు తాటిపర్తి వెంకటేశ్వర్లు తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. సేవా తెలుగు భాష, సాహితీ సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో నెల్లూరులోని పురమందిరంలో శుక్రవారం నిర్వహించి తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో గిడుగు వారసులు గిడుగు సరస్వతి, గిడుగు గణేష్ కార్తీక్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేసి అభినందించారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



సంగం: ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కే వేణుగోపాల్ తెలిపారు. సంగం పెన్నా బ్యారేజ్ వద్ద గణేశ్ నిమజ్జన ప్రాంతాన్ని సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. నిమజ్జన ఏర్పాట్లపై సీఐ, ఎస్సైకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో 375 విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యారేజ్ వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గణేశ్ నిమజ్జనాన్ని నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

వినాయక చవితి వేడుకల్లో ఇరువర్గాల ఘర్షణ

మర్రిపాడు: వినాయక చవితి వేడుకల్లో టీడీపీకి చెందిన ఇరువర్గాల వారు ఘర్షణకు పాల్పడగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మర్రిపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపాడులోని వినాయకుడి మండపం వద్ద సాయంత్రం ఉట్టి కొట్టే విషయంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల నడుమ నెలకొన్న స్వల్ప వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఓ వర్గానికి చెందిన మాలే పాటి వెంకటేశ్వర్లుతో పాటు మరోవ్యక్తికి గాయాలయ్యాయి. వారిని ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని విచారిస్తున్నారు.



ఆత్మకూరురూరల్: ఉత్తరకాలువలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనం



ఆత్మకూరు: నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళ్తున్న పంటవీధి గణనాథుడు



దుత్తలూరు: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



ఆత్మకూరు: నిమజ్జనానికి తరలివెళ్తున్న నాగేంద్రపురం గణనాథుడు

గంగమ్మ ఒడికి బొజ్జ గణపయ్య

- వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవం

ఆత్మకూరు: గణేశ్ నిమజ్జనోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు మూడోరోజు ఉదయం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆత్మకూరు చెరువులో గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. పంటవీధిలోని గణనాథుడి ఊరేగింపు కోలాహలంగా సాగింది. గణనాథుడి ఊరేగింపు ముందు సింహ వాహనంపై దుర్గాదేవి, ఆ వెనక గజ వాహనాలపై వినాయకుడు, శివపార్వతులు కొలువుదీరి ముందుకు సాగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆర్యవైశ్య బజారులో సుందరమ్మ ఆలయం, తోటవీధి, చల్లా వీధి, రజకవీధి ప్రాంతాల్లోని బొజ్జ గణపయ్యల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. యువతీయువకులు పెద్ద ఎత్తున పాల్గొని రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. తోటవీధిలోని గణేశ్ లడ్డూను వేలంలో రూ.15వేలకు పెంచలయ్య అనే భక్తుడు దక్కించుకున్నాడు. కాగా ఆత్మకూరు చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనానికి మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బీ సాయిప్రసాద్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): అనుమసముద్రంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను మూడోరోజు నిమజ్జనానికి తరలించారు. గణనాథుడి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సంగం వద్ద పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కాగా ఏఎస్‌పేటలోని వినాయక సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద మూడో రోజు సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. యువత ఉత్సాహం పాల్గొన్నారు.



వరికుంటపాడు : వెంగమాంబపురంలో గణనాథుడి ఊరేగింపు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను మూడోరోజు నిమజ్జనానికి తరలించారు.బంట్లపల్లి సమీపంలోని సోమశిల ఉత్తరకాలువ 33ఆర్ ఉపకాలువలో గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు.

వరికుంటపాడు: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను మూడోరోజు శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. వేంపాడు పంచాయతీ వెంగమాంబపురంలోని వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూను వేలంలో చలంచర్ల కొండయ్య రూ.23 వేలకు కైవసం చేసుకున్నాడు.

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలను మూడోరోజు నిమజ్జనం చేశారు. ముందుగా ఉట్టి కొట్టి వినాయకుడి లడ్డూలను వేలం వేశారు. అనంతరం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రాక్టర్లపై కొలువుదీర్చి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

సీతారామపురం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య ప్రతిమలను మూడోరోజు నిమజ్జనానికి తరలించారు. గ్రామాల్లో ఊరేగించి మర్రివూట్ల వాగు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నెమళ్లదిన్నెలో గణనాథుడి వద్ద ఉంచిన లడ్డూకు వేలం నిర్వహించగా తోకల చంద్రమోహన్ రూ.23 వేలకు దక్కించుకున్నాడు. అలాగే పండ్లు, కలశాన్ని వడ్లమాని మద్దిలేటి రూ.6,500కు దక్కించుకున్నాడు.

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన గణనాథుడి విగ్రహాలను మూడో రోజు శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో గణనాథుడ్ని ఊరేగించి జలవనరుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం మండపాల వద్ద అన్నదానం చేశారు.

కలిగిరి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను మూడోరోజైన శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. తొలుత యువత ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. అనంతరం వినాయకుడి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కాగా కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపనముసలిపాళెంలో వినాయకుడి లడ్డూకు వేలం నిర్వహించగా పాపన హజరత్‌రెడ్డి రూ.41 వేలకు దక్కించుకున్నాడు.



కలిగిరి: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



అల్లూరులో అన్నదానం

అన్నదానం

అల్లూరు: స్థానిక అన్నదాత వీధిలోని గణేశ్ మండపం వద్ద మూడో రోజైన శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 800 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.



ఆత్మకూరు చెరువులో క్రేన్ సాయంతో బొజ్జ గణపయ్య నిమజ్జనం



ఏఎస్‌పేటలో ఉట్టి మహోత్సవం



సీతారామపురం: రూ.23వేలకు లడ్డూను దక్కించుకున్న టీ చంద్రమోహన్



కొండాపురం: కొమ్మి బీసీ కాలనీలో అన్నదానం



కలిగిరి: రూ.41వేలకు లడ్డూను దక్కించుకున్న హజరత్‌రెడ్డి

సముద్రంలో గల్లంతైన యువకుడు

- మత్స్యకారుడి సహకారంతో కాపాడిన హోంగార్డు

కావలి (జలదంకి): తుమ్మలపెంట తీరంలో వినాయకుడ్ని నిమజ్జనం చేసేందుకు వచ్చి ప్రమాదవశాత్తు గల్లంతైన ఓ యువకుడిని మత్స్యకారుడి సహకారంతో హోంగార్డు కాపాడాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. జలదంకికి చెందిన కుట్టుబోయిన మహేష్ వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తుమ్మలపెంట తీరానికి వచ్చాడు. అక్కడ విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేసే సమయంలో పెద్ద అల రావడంతో మునిగిపోయాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నరేంద్ర గమనించి వెంటనే కాపాడేందుకు సముద్రంలోకి వెళ్లగా వీలు కలగలేదు. దీంతో తుమ్మలపెంటకు చెందిన మత్స్యకారుడు బాబు సహకారంతో మహేష్‌ను ఒడ్డుకు తీసుకొచ్చాడు. మహేష్ ప్రాణాలతో బయటపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కాగా మహేష్‌ను కాపాడిన హోంగార్డు, మత్స్యకారుడ్ని పోలీసులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కొండాపురం: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ బొడ్డు అనురాధ కోరారు. మండల పరిషత కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషసాయి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవా రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మండలాధికారు లు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

కావలి (జలదంకి): కావలిలోని ఉదయగిరి బ్రిడ్జిపై శుక్రవారం గణనాథుడ్ని నిమజ్జనానికి తరలిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో టాక్టర్ ట్రక్కులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. జలదంకి మండలం చింతపాళెం గ్రామానికి చెందిన వారు వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తుమ్మలపెంటకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కావలి రెండో పట్టణ పోలీసులు ట్రాక్టర్‌ను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ అస్తవ్యవస్తంగా తయారైంది. మండల కేంద్రమైన వింజమూరులో ఇంటింటికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం లేదు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది స్మార్ట్ రేషన్ కార్డులను ఇష్టారాజ్యంగా టేబుళ్లపై పడేస్తున్నారు. దీంతో ప్రజలు తమ ఇష్టానుసారంగా కార్డులు పట్టుకెళుతున్నారు. ఈ క్రమంలో పలువురి లబ్ధిదారుల కార్డులు గల్లంతవడంతో వారు లబోదిబోమంటున్నారు. ప్రతి రేషన్ దుకాణం పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు వీఆర్వో, వీఆర్ఏ లేదా సచివాలయ సిబ్బందిని నియమించారు. వీరు తమ పరిధిలోని రేషన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ కార్డులను పంపిణీ చేయాలి. అవసరమైతే స్థానిక రేషన్ షాపు డీలర్ సహాయం తీసుకోవాలి. ఈ నెల 30వ తేదీలోగా పంపిణీని పూర్తి చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను తహసీల్దార్ పర్యవేక్షించాలి. కానీ మండలంలోని 26 రేషన్ దుకాణాల పరిధిలో నియమించిన ఉద్యోగులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వింజమూరులో ఇంటింటికీ పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు తమ కార్డులు కోసం సచివాలయాలకు పరుగులు పెడుతున్నారు. సచివాలయ సిబ్బంది కార్డులు పంపిణీ చేయకుండా టేబుళ్లపై పడేయంతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఈ పరిస్థితి గ్రామ సచివాలయాలు 5,3,1ల్లో శుక్రవారం కనిపించింది. కార్డు చెల్లుబాటు కావాలంటే లబ్ధిదారుడు తమ వేలిముద్ర లేదా ఓటీపీని ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారి వద్ద నమోదు చేయాలి. కానీ ఇదేమి జరడగం లేదు. ఈ ప్రక్రియ జరగకపోతే కార్డు అధికారికంగా వెబ్‌సైట్‌లో నమోదు కాదు. దీంతో కార్డు చెల్లుబాటు కాదని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సిబ్బంది కార్డులు పంపిణీ చేస్తేనే సదరు ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. కానీ కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కార్డులు చెల్లుబాటవని పరిస్థితి నెలకొంది. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వింజమూరులోని గ్రామ సచివాలయంలో కార్డులు ఏరుకుంటున్న లబ్ధిదారులు

గేదెను ఢీకొని కారు బోల్తా



మర్రిపాడు: మర్రిపాడు సమీపంలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కడప నుంచి నెల్లూరు వెళ్తున్న కారు మర్రిపాడు సమీపంలో గేదెను బలంగా ఢీకొని అదుపుతప్పి ముళ్లపాదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీసి మరో వాహనంలో ఆత్మకూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోపీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ రమణ, అధ్యాపక సిబ్బంది రఘునాథరెడ్డి, సునీత, అశోక్, మాధవి, శోభ పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల తొలగింపు దారుణం

ఆత్మకూరు: పింఛన్లను తొలగించి వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పొట్టకొట్టడం దారుణమని సీపీఐ నాయకులు మండిపడ్డారు. తొలగించిన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై మధు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడంతో వారిని కుటుంబసభ్యులు చిన్నచూపు చూస్తున్నారన్నారు. దివ్యాంగులకు పింఛన్లే జీవనాధారమని, వికలత్వ శాతాన్ని తగ్గించి పింఛన్లను తొలగించాలని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జీ నాగరాజు, జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, బీ హజరత్తయ్య, ఎం కొండయ్య, రమణయ్య, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

సంగం: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవితకు బంగారుబాటలు వేసుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని విక్రమ సింహపురి వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నేతాజీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో వీసీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం-2020లో భాగంగా ఆర్ట్స్ విద్యార్థులకు డిగ్రీ స్థాయిలో సైన్స్ కోర్సులు చదివే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్ట్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సమన్వయంతో విద్యాభ్యాసం పూర్తి చేస్తే ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదుగుతారన్నారు. అనంతరం వసతి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



వసతి భవనాన్ని ప్రారంభించిన వీసీ అల్లం శ్రీనివాసరావు

పోలీసుల తీరు అత్యంత హేయం

కావలి (జలదంకి) : కావలి నియోజకవర్గంలో పోలీసులు అనుసరిస్తున్న తీరు అత్యంత హేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకట నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం వారు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆర్ఎస్సార్ కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న తరుణంలో వారి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. కావలి నియోజకవర్గంలో అలనాటి బ్రిటీష్ పాలన కొనసాగుతోందని విమర్శించారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి సొంత రాజ్యాంగ్యాన్ని నడిపిస్తున్నాడని, దానికి పోలీసులు వంతపాడడం దారుణంగా ఉందన్నారు. రామిరెడ్డి నివాసానికి నెల్లూరు నుంచి, కావలిలోని నాయకులు, కార్యకర్తలను రానీయకుండా అడ్డుకోవడం చూస్తుంటే టీడీపీ నాయకుల గుండెల్లో వణుకు కనిపిస్తుందన్నారు. అవినీతిని ప్రశ్నించిన ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం, అవినీతిని వెలికితీస్తామన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తలలు తీస్తామని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విరుచుకుపడడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేకు ప్రజలు తగిన బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పత్రి మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంధం, కనమర్లపూడి

ప్రత్యేకావసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు

కావలి (జలదంకి): ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలను అందజేస్తోందని జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ పెంచలయ్య తెలిపారు. కావలిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు వారి హక్కులను వివరించారు. అనంతరం ప్రత్యేకావసరాల పిల్లలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను గుర్తించి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కావలి, జలదంకి ఎంఈఓలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, పద్మనాభరావు, కావలి,జలదంకి, బోగోలు, దగదర్తి అల్లూరు మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీఎంఓ పెంచలయ్య

బాల్యానికి భరోసా ఏదీ?

- గ్రామ సచివాలయాల్లో కనిపించని వివాహ నమోదు
- అధికారులు, ప్రజల్లో కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

సీతారామపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను అరికట్టాలని ప్రభుత్వాలు, ఉన్నతాధికార యంత్రాంగం హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామ పంచాయతీల్లో వివాహాల నమోదు తప్పనిసరని ప్రభుత్వాలు చెబుతున్నా ఎక్కడా కూడా చేపట్టడం లేదు. దీంతో గ్రామీణుల్లో అవగాహన లోపంతో నేటికీ బాల్యవివాహాలు అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. పంచాయతీల్లో వివాహాల నమోదును తప్పనిసరి చేస్తూ 2002లో చట్టం చేశారు. జీఓ నంబర్ 193 ప్రకారం పంచాయతీ కార్యదర్శులు వివాహాల నమోదు చేపట్టాల్సి ఉన్నా నేటికీ వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేదు. దీంతో పలువురికి జనన,మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప వివాహాల నమోదుపై అవగాహన లేదు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల వయసు తప్పనిసరి అనే విషయం గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. ఇప్పుడు ప్రతిదానికి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసినా ఆ వైపు అడుగులు పడడం లేదు.



సచివాలయాల్లోనే నమోదు

గతంలో గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు ప్రక్రియ ఉండగా, ఇప్పుడు గ్రామ సచివాలయాల్లో చేపడుతున్నారు. వివాహం జరిగిన 30రోజుల్లోపు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే వివాహ నమోదు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఆ తర్వాత రోజుకు వంద రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

అవగాహన లోపంతోనే..

ఒకవైపు ఆర్థిక సమస్యలు, మరొకవైపు అవగాహన లేమితో గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. జిల్లాలో పలుచోట్ల ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకునేందుకు గ్రామస్థాయిలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు జంకుతున్నారు. ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలోని పలు చోట్ల రెవెన్యూ, పోలీసు, ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలను అడ్డుకున్నారు. బాల్య వివాహాలు పోలీస్ స్టేషన్ వరకు వచ్చినా, వారి దగ్గర నిబంధనల ప్రకారం నడుచుకుని ఆ తర్వాత వివాహాలు చేసుకుంటున్న ఘటనలు కోకొల్లలు. దీంతో బాల్య వివాహాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు.

అవగాహన అవసరం



గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి కాగానే బాలికలకు బాల్య వివాహాలు చేస్తుంటారు. బాల్య వివాహాలపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పంచాయతీల్లో వివాహాలను నమోదు చేసుకోవాలనే నిబంధనను విధిగా పెడితే వాటిని అరికట్టవచ్చు.

–బీ రత్నం, ప్రగతి డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్, అయ్యవారిపల్లి

ఆదేశాలు జారీ చేశాం



గ్రామాల్లో వివాహాల నమోదును తప్పనిసరి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రజలు సహకరించాలి.

–సాయిప్రసాద్, ఎంపీడీఓ, సీతారామపురం.